

మొక్కజొన్న సాగుకే మొగ్గు

జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలో రైతులు మొక్క జొన్న సాగుకే మొగ్గు చూపుతున్నారు. వివరాలు 8లో ▸



గురుకులం భూమి.. దర్జాగా కబ్జా

సిద్దిపేట జిల్లాలో ఏసీ శివారులో గురుకుల పాఠశాలకు గత ప్రభుత్వం కేటాయించిన భూమిని అక్రమార్కులు కబ్జా చేసేశారు. వివరాలు 8లో ▸



లేదయ్యా.. యూరియా!

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ లేదన్నట్లుంది రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లోని రైతుల పరిస్థితి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

చేనేతలకు చేయూతనిద్దాం

జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజాశర్మ



మేళాలో వస్త్రాలను పరిశీలిస్తున్న రోజాశర్మ

సిద్దిపేట(ప్రశాంత్‌నగర్): చేనేతలకు చేయూత ఇవ్వాలని, వారి హస్తకళా వస్తువులు కొనుగోలు చేయాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజాశర్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని శక్తిగార్డెన్‌లో ఏర్పాటు చేసిన కళాభారతి చేనేత, హస్తకళ మేళాను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ప్రజలు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరిన యువకులు

ములుగు(గజ్వేల్): మండల పరిధిలోని వంటిమామిడి, లక్ష్మక్కపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి చింతల అరుణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో దినేష్ యాదవ్, నిఖిల్, దినేష్‌బాబు, రాము తదితరులు లోని ఆయన నివాసంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో పార్టీ గజ్వేల్ నియోజకవర్గం కో కన్వీనర్ సురేష్, ఉపాధ్యక్షుడు మహేష్‌గౌడ్, మండల కార్యదర్శి కన్నారెడ్డి, కోశాధికారి సత్యంయాదవ్, సాయి ముదిరాజు, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన గుడ్లు అందించాలి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిద్దిపేటరూరల్: విద్యార్థులకు అందించే పౌష్టికాహారంలో నాణ్యమైన గుడ్లు అందించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పాఠశాలలు, వసతి గృహాల్లో, అంగన్‌వాడీల్లో అందిస్తున్న గుడ్లు నాణ్యతపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గరీమా అగర్వాల్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నాణ్యత, పరిమాణం కలిగిన గుడ్లనే ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి నాగరాజమ్మ, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి కవిత, వివిధ గురుకులాల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా స్వరూపరాణి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా స్వరూపరాణిని నియమితులయ్యారు. రాష్ట్ర వ్యవసాయశాఖ సెక్రటరీ రాఘునందన్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించిన రాధిక స్థానంలో స్వరూపరాణి బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

అదనపు డీఆర్‌డీఓ సుధీర్



మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీఓ సుధీర్

ములుగు(గజ్వేల్): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని అదనపు డీఆర్‌డీఓ సుధీర్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా శుక్రవారం ములుగులో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కళాకారులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పాటల రూపంలో మహిళలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రకాశ్, విద్యాసాగర్, ఏపీఎం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనంలో.. తడబడి

ఉమ్మడి జిల్లా వెనుకబాటు



- పరాఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ తాజా నివేదిక
- సగటు మార్కుల కంటే తక్కువ స్కోర్
- 251 పాఠశాలల్లో సర్వే

సాక్షి, సిద్దిపేట : అభ్యసన సామర్థ్యాలు సాధించడంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన విద్యార్థులు వెనుకబడుతున్నారు. మూడు, ఆరు, తొమ్మిదవ తరగతుల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వివిధ సబ్జెక్ట్‌ల్లో పరీక్షలు నిర్వహించగా మెదక్, సంగారెడ్డి జిల్లాలు మాతృభాష, మ్యాథ్స్, పరిసరాల విజ్ఞానం, సైన్స్, సోషల్ అన్ని విభాగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి సగటు మార్కుల కంటే వెనుకబడి ఉన్నారు. సిద్దిపేట జిల్లా 6వ తరగతి మాతృభాషలో రాష్ట్రంతో సమానంగా, మ్యాథ్స్‌లో 9వ తరగతిలో రాష్ట్ర, జాతీయ స్థాయి సగటు మార్కుల కంటే ఎక్కువగా సాధించారు. మిగతావి అన్నీ వెనుకబాటే.. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) వారు పరాఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ – 2024 నివేదికను ఇటీవల విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా విద్యార్థుల అభ్యసన పరిస్థితిని తేటతెల్లం చేశాయి.

గత నివేదికతో పోలిస్తే..

ఉమ్మడి మెదక్ జిల్లాలో 251 పాఠశాలలో సర్వే చేపట్టారు. ఇందులో 932 మంది టీచర్లు, 6,921 మంది విద్యార్థులున్నారు. ఈ పరీక్షలో 3వ తరగతి వారు 2,052, 6వ 2,061, 9వ తరగతి విద్యార్థులు 2,808 మంది ఉన్నారు. పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ -2023 నివేదికతో పోలిస్తే కాస్త మెరుగు పడ్డామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి మెదక్ మ్యాథ్స్‌లో బాలురదే పై చేయి

ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్ని సబ్జెక్ట్‌ల్లో దాదాపు బాలురు వెనుకబడి ఉండగా మ్యాథ్స్‌లో మాత్రం అత్యధిక మార్కులు సాధించారు. మిగతా వాటిలో బాలికలే ఎక్కువ ప్రతిభ కనబర్చారు.

☛ సంగారెడ్డి జిల్లాలో 3వ, 6వ తరగతులలో విద్యను అభ్యసిస్తున్న బాలురతో పోలిస్తే బాలికల్లోనే అభ్యసన సామర్థ్యాలు మెరుగ్గా ఉన్నాయి. 9వ తరగతి మాతృభాషలో బాలుర కంటే బాలికలదే పై చేయి. మ్యాథ్స్‌లో బాలురు, బాలికలు సమాన సామర్థ్యాలున్నాయి.

☛ సిద్దిపేట జిల్లాలో 3వ తరగతి విద్యార్థుల్లో బాలుర కంటే బాలికలే అభ్యసన సామర్థ్యాలు మెరుగ్గా ఉన్నాయి. 6వ తరగతిలో మాతృభాషలో బాలికలదే, మ్యాథ్స్‌లో భిన్నంగా బాలికల కంటే బాలురే అభ్యసన సామర్థ్యాలు ఎక్కువగా కలిగి ఉన్నారు. 9వ తరగతిలో బాలుర కంటే బాలికలే ప్రతిభను కనబరుస్తున్నారు.

☛ మెదక్ జిల్లాలో 3వ తరగతిలో మాతృభాషలో బాలికలు, మ్యాథ్స్‌లో బాలురు అత్యధిక స్కోర్ చేశారు.

6వ తరగతిలో మాతృభాషలో బాలికలు, మ్యాథ్స్‌లో బాలురు, 9వ తరగతిలో మాతృభాషలో బాలికలు, మ్యాథ్స్ బాలికలు బాలురు సమాన స్కోర్, సైన్స్, సోషల్‌లలో బాలుర కంటే బాలికలు అత్యధిక మార్కులు సాధించారు. ఇంకా మెరుగు పడాలి. అంటే విద్యార్థులు మరింత ప్రతిభ కనబర్చాలి.

తరగతుల వారీగా జిల్లాల సగటు స్కోర్

సబ్జెక్ట్	మెదక్			సిద్దిపేట			సంగారెడ్డి		
	3వ	6వ	9వ	3వ	6వ	9వ	3వ	6వ	9వ
మాతృభాష	53	49	46	54	53	53	56	52	47
మ్యాథ్స్	48	41	30	52	43	38	51	44	32
పరిసరాల విజ్ఞానం	-	40	-	-	43	-	-	46	-
సైన్స్	-	-	33	-	-	38	-	-	35
సోషల్	-	-	32	-	-	37	-	-	35

కాయకల్ప అవార్డుల పంట

- గజ్వేల్ ఏరియా ఆస్పత్రికి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం
- దుబ్బాక, హుస్నాబాద్ ఆస్పత్రులకు సైతం ప్రోత్సాహక బహుమతులు



మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ

సిద్దిపేటకమాన్: కేంద్ర ప్రభుత్వం అందించే కాయకల్ప అవార్డులలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించింది. 2024–25 సంవత్సరానికి గాను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులకు రాష్ట్ర స్థాయిలో పోటీ నిర్వహించగా గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. దీంతో రూ.10లక్షల నగదు అవార్డు లభించింది. ఆస్పత్రి నిర్వహణ, ఇన్‌ఫెక్షన్ నియంత్రణ, పరిశుభ్రత తదితర అంశాల్లో మెరుగైన సేవలందించినందుకు గాను ఈ అవార్డు వరించింది. అదేవిధంగా దుబ్బాక ఏరియా ఆస్పత్రికి ప్రోత్సాహక బహుమతి కింద రూ.లక్ష, ఇకో ఫ్రెండ్లీ అవార్డు కింద రూ.5లక్షల నగదు లభించింది. హుస్నాబాద్ ఏరియా ఆస్పత్రికి ప్రోత్సాహక బహుమతి కింద రూ.లక్ష నగదు అవార్డు లభించిందని సిద్దిపేట డీసీహెచ్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మర్కూక్ పీహెచ్‌సీ 87స్కోర్‌తో ఉత్తమ పీహెచ్‌సీగా రూ.2లక్షల నగదు రివార్డు, ప్రోత్సాహకంగా అక్కన్నపేట, బెజ్జంకి, చిన్నకోడూరు, రామక్కపేట పీహెచ్‌సీలకు రూ.50వేల చొప్పున నగదు అందనున్నట్లు తెలిపారు. ఇందిరానగర్ యూపీహెచ్‌సీ 86స్కోర్‌తో రూ.2లక్షల నగదు, అంబేద్కర్‌నగర్ యూపీహెచ్‌సీ 74స్కోర్‌తో 50వేల నగదు పురస్కారానికి ఎంపికైనట్లు తెలిపారు. జిల్లాలో మూడు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులు కాయకల్ప అవార్డులు సాధించడం గొప్ప విషయం అన్నారు. కాయకల్ప అవార్డుల ప్రోత్సాహంతో ఆస్పత్రుల పనితీరును మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.



గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రి

విధుల్లో నిర్లక్ష్యం తగదు

- రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి
- కలెక్టర్ హైమావతి
- వైద్యులకు, సిబ్బందికి ఆదేశాలు



కోహెడ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని కలెక్టర్ హైమావతి వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్‌ను, సిబ్బంది హాజరు రికార్డును పరిశీలించారు. ఆస్పత్రిలో ఎనిమిది మంది సిబ్బంది విధులను హాజరైనట్లు సంతకాలు చేశారు. కానీ ఇందులో సబ్‌ఆర్డినేటర్ భిక్షపతి, సూపర్‌వైజర్లు వేంకటేశ్వర్లు, సుభద్ర, ఫార్మిసిస్టు సమ్మయ్య, స్టాఫ్‌నర్సు సృజనలు విధులకు హాజరుకానప్పటికీ హాజరైనట్లు ఉండటాన్ని కలెక్టర్ గుర్తించారు. దీంతో సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పులు మరోసారి జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. సీజనల్ వ్యాధుల వేళ రోగులకు సరిపడా మందులు ఉన్నయా అని ఆరా తీశారు. హుస్నాబాద్ ఆర్డీఓ రాంమ్మూర్తి, తహసీల్దార్ అమీద్ సమీర్, ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ శోభ, సీఐ శ్రీను, ఎస్‌ఐ అభిలాష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఆగ్రహం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి, శనిగరం గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా శనిగరంలోని పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనంలో మిక్స్ వెజిటబుల్ కర్రీ, సాంబారు, గుడ్డుకు బదులు కేవలం సాంబారు, గుడ్డు పెట్టడంపై నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే శనిగరంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. అనంతరం తంగళ్లపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించే స్థలాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

ఇసుక కొరత రావొద్దు

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత రావొద్దని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్‌లతో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా ఎక్కడ ఇసుక నిల్వలు ఉన్నాయో పరిశీలించి ఇళ్లు నిర్మించుకునే వారికి టోకెన్లు అందించాలన్నారు. మోయతుమ్మెద, కూడవెల్లి వాగు, ఉపకాలువల్లో ఇసుక నిల్వలు ఉన్న మండలాల్లో ఎలాంటి సమస్య లేదని, నిల్వలు లేని మండలాల వారు కూడా ఇసుక తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఎంపీడీఓలు తహసీల్దార్లు కోరిన వెంటనే టోకెన్ ద్వారా ట్రాక్టర్‌లో తరలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ట్రాక్టర్ వద్ద టోకెన్ ఉండాలని లేని పక్షంలో ట్రాక్టర్‌ను సీజ్ చేయాలన్నారు. అందరి సమన్వయంతో ఇసుక కొరత తలెత్తకుండా ఇళ్ల లబ్ధిదారులకు అందించాలన్నారు.

కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

- టార్గెట్ పూర్తి చేయాలి
- స్పెషల్ ఆఫీసర్ కిషన్

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను మరింతగా పెంచేందుకు ప్రత్యేక దృష్టిసారించాలని సిద్దిపేట, మెదక్ జిల్లాల ప్రత్యేక అధికారి, మేడ్చెల్ జిల్లా ఇంటర్ విద్యాధికారి కిషన్ సూచించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల(కోఎడ్యుకేషన్)ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులతో ప్రత్యేకంగా సమావేశమై పలు సూచనలు సలహాలను అందించారు. కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ టార్గెట్ పూర్తి చేసిన ప్రిన్సిపల్స్‌ను, అధ్యాపకులను అభినందించారు. అంతకు ముందు ఇంకా అడ్మిషన్ టార్గెట్ పూర్తికాని ప్రిన్సిపల్స్‌తో సమావేశమై వీలైనంత త్వరగా అడ్మిషన్లు పూర్తి చేసి తరగతుల నిర్వహణపై శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. మొత్తంగా ఈ విద్యాసంవత్సరం ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. డీఐఈఓ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలకు అవసరమైన నిధులను ప్రభుత్వ కేటాయించిందని అవసరమైన పనులను చేసుకోవాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, దేవయ్య, కనకచంద్రం, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, వెంకటరమణ, రఘురాజ్, నగేష్, గంగాధర్, కౌసర్, రాజశేఖర్, నరేందర్డ్డి, శ్రీకాంత్, సత్యనారాయణ, ప్రసాద్‌కుమార్, ఫాతిమా, భాస్కర్, కొమురయ్య, దాసుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మౌలికవసతులపై ప్రత్యేక దృష్టి

దుబ్బాక: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రాష్ట్ర వ్యాప్తంగా మౌలిక వసతుల కల్పనకు రూ.56కోట్లు కేటాయించినట్లు ఇంటర్ విద్యాధికారి కిషన్ తెలిపారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డితో కలిసి దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పూర్వ వైభవం తీసుకురావాలన్న సదుద్దేశ్యంతో ఇంటర్ బోర్డు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. గతేడాది కంటే ఈసారి 30 శాతం అధికంగా అడ్మిషన్లు పెంచాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుదీర్ఘ అనుభవం గల లెక్చరర్లు ఉన్నారని అన్నారు. మౌలిక వసతులకు సిద్దిపేట జిల్లాకు రూ.2 కోట్లు కేటాయించామన్నారు. పరిశుభ్రత పాటించేందుకు స్కావెంజర్ల నియామకం చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు నీట్, ఇంజనీరింగ్, ఐఐటీ చేరేందుకు ప్రవేశ పరీక్షల్లో విజయంసాధించేందుకు ఫిజిక్స్‌వాలా, ఖాన్ అకాడమి కోచింగ్ సెంటర్లతో ఇంటర్ బోర్డు ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ సందర్భంగా ఇంటర్‌బోర్డు కమిషనర్ కిషన్, డీఐఈఓ రవీందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, లెక్చరర్లు శివకుమార్, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ కిషన్, చిత్రంలో డీఐఈఓ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి

జనాభా నియంత్రణ అందరి బాధ్యత

సిద్దిపేటకమాన్: జనాభా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ నారాయణరావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన దంపతులు కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులు పాటించాలన్నారు. నేటి సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు వృద్ధి చెందుతున్నారన్నారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. లక్కీడిప్ ద్వారా ఎంపికైన ముగ్గురు దంపతులకు నగదు రివార్డు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ నారాయణరావు

ఇసుక వాహనాలు పట్టివేత

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు బొలెరో వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు. గ్రామ శివారులోని వాగు నుంచి బెజ్జంకి, చిన్నకోడూరు మండలాలకు ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో శుక్రవారం దాడిచేసి మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నారాయణపూర్ నుంచి హుస్నాబాద్‌కు ఇసుక తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను కూడా స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు ఏవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలు అరికట్టడం చాలా సులువన్నారు. సైబర్ నేరాల బారిన పడిన వారు గంటలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది, కళాబృందం సభ్యులు రోజు ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు ఎవరూ స్పందించకూడదని, ఏటీఎం పిన్ నంబర్లు, ఓటీపీ వివరాలు వంటి వ్యక్తిగత వివరాలు ఇతరులకు తెలపకూడదని సూచించారు.

సరికొత్తగా సేంద్రియ సాగు

- ఎస్‌ఎంఎన్‌ఎఫ్ పథకం కింద కార్యాచరణ మారు
- ఎంపిక చేసిన గ్రామాల్లో పూర్తిస్థాయి భూసార పరీక్షలు
- ఒక్కో గ్రామంలో 125మంది వ్యవసాయక్షేత్రాల్లో సాగుకు నిర్ణయం
- మహిళా సంఘాలను భాగస్వాములను చేసే ఆలోచన

మట్టి నమూనాల సేకరణ

ఎస్‌ఎంఎస్‌ఎఫ్ పథకం కోసం ప్రతి వ్యవసాయ డివిజన్‌లో 3నుంచి 5గ్రామాలను ఎంపిక చేశారు. సిద్దిపేట జిల్లాకు సంబంధించి జిల్లాను 15సెక్టార్లగా విభజించారు. ఒక్కో సెక్టార్‌కు 125మంది రైతులను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో పూర్తిస్థాయి మట్టి నమూనాలు సేకరించారు. వాటి ఫలితాలు వచ్చిన తరువాత సేంద్రియ సాగును మొదలు పెట్టే ఆలోచనలో ఉన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలను, మహిళా సంఘాల సభ్యులకు శిక్షణనిచ్చి.. వారి ద్వారా రైతులను చైతన్యపరచనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ పథకం అమలుపై పూర్తిస్థాయిలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



గజ్వేల్ ప్రాంతంలో సేంద్రియ సాగు కోసం మట్టి నమూనాల సేకరణ

గజ్వేల్: సేంద్రియ సాగును నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్(ఎస్‌ఎంఎస్‌ఎఫ్) పథకం కింద సరికొత్తగా చేపట్టడానికి ఎట్టకేలకు కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది. కొన్నేళ్లుగా చతికిల పడిన ఈ పద్ధతికి జవసత్వాలు నింపడానికి ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ప్రతి వ్యవసాయ డివిజన్ పరిధిలో 3నుంచి 5 గ్రామాలను ఇందుకోసం ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో పూర్తిస్థాయి భూసార పరీక్షలు చేపట్టడానికి మట్టినమూనాలను సేకరించారు. వాటి ఫలితాలు రాగానే సేంద్రియ సాగు మొదలు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు.

వానాకాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 14లక్షల పైచిలుకు ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వస్తాయి. రబీలో 8లక్షల ఎకరాల వరకు సాగులో వస్తుంటాయి. వానాకాలంలో రైతులు రసాయనిక ఎరువులపైనే ఆధారపడటం వల్ల ఏటా ఆయా నియోజకవర్గాలకు ఏప్రిల్‌నుంచి సెప్టెంబర్ వరకు యూరియా లక్ష మెట్రిక్ టన్నులకు పైగా, డీఏపీ 60వేల మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 58మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 1.5లక్షల మెట్రిక్ టన్నులు మొత్తం కలుపుకొని 3.68లక్షల మెట్రిక్ టన్నుల రసాయనిక ఎరువుల స్టాకు అవసరమని అంచనా. రబీలో మరో 2లక్షల మెట్రిక్ టన్నులు అవసమయంటుందని తెలుస్తోంది.

సరిగ్గా అయిదేళ్ల తర్వాత మళ్లీ..

మోతాదుకు మించి ఎరువులను వాడటం వల్ల నేల సారం తగ్గి పంటల సాగులో దిగుబడులు పడిపోయి రైతు లు నష్టాల బారిన పడటం సహజపరిణామంగా మారుతున్నది. మరోవైపు రసాయనిక ఎరువుల విచక్షణారహితంగా వాడటం వల్ల పంటల ఉత్పత్తుల్లో పోషకాలు లోపించి, కలుషితమవుతున్నాయి. ఈ పరిణామం ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారుతోంది. ఈ దుస్థితిని మార్చేందుకు గతంలో పీకేవీవై(ప్రధాన మంత్రి కృషి వికాస్ యోజన) ద్వారా నిధులు అందించి సేంద్రీయ సాగును ప్రోత్సహించేవారు. ఒక్కో మండలంలో 50 ఎకరాల సాగుకోసం 1 నుంచి 4 గ్రామాలను ఎంపిక చేసి దానిని సెక్టార్‌గా పరిగణించి ఆ సెక్టార్ పరిధిలో సాగు చేపట్టేవారు. ఈ క్రమంలోనే విత్తనం వేసింది మొదలు పంట చేతి కొచ్చే వరకు రైతులకు వ్యవసాయశాఖ సబ్సిడీపై సేంద్రియ సాగుకు ఊతమిచ్చే.. జనుము, జీలుగ, బయోఫర్టిలైజర్స్ అందించేవారు. అదేవిధంగా పంటల్లో క్రిమికీటకాల నివారణకు జీవామృతం, నీమాయిల్ తదితర సేంద్రియ మిశ్రమాలను సైతం ఇచ్చేవారు. మొత్తం ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో ఏఈవోలు, వ్యవసాయాధికారులు నిరంతరం పర్యవేక్షించేవారు. ఈనేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మంచి ఫలితాలు వచ్చాయి. ప్రత్యేకించి గజ్వేల్ డివిజన్ పరిధిలో వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వరి సాగులో సేంద్రియాన్ని ప్రోత్సహించారు. ఈ పద్ధతిలో పండించిన వడ్లను బియ్యంగా మార్చి.. మార్కెటింగ్ చేయడానికి కూడా ప్రోత్సహించేవారు. అయిదేళ్ల క్రితం ఈ కార్యక్రమాలు సజావుగా సాగాయి. కానీ ప్రస్తుతం నిధులు రాక.. సేంద్రియ సాగు పథకం నిలిచిపోయింది. ఈ క్రమంలోనే సరిగ్గా అయిదేళ్ల తర్వాత ప్రభుత్వం తిరిగి ఎస్‌ఎంఎన్‌ఎఫ్ పథకాన్ని తీసుకొచ్చింది.

రైతులను ఎంపిక చేశాం



జిల్లాలో ఎస్‌ఎంఎస్‌ఎఫ్ కార్యక్రమాలను ప్రారంభించాం. అన్ని వ్యవసాయ డివిజన్లలో రైతుల ఎంపిక చేశాం. వారి వ్యవసాయక్షేత్రాల్లో మట్టి నమూనాల సేకరణ కూడా పూర్తయ్యింది. వాటి ఫలితాలు రానున్నాయి. ఈ పథకానికి సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. రాగానే ఆమేరకు ముందుకుసాగుతాం.

– రాధిక, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

సిద్దిపేటలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీ

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఉమెన్ చాంపియన్ టోర్నీ నిర్వహించనున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిరాం, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, సిటిజన్ క్లబ్ అధ్యక్షుడు రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... శని, ఆదివారాల్లో స్థానిక సిటిజన్ క్లబ్ ఆధ్వర్యంలో టోర్నీ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలను శనివారం సాయంత్రం 5 గంటలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

పునరావాస పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: దివ్యాంగులు ఆర్థిక స్వావలంబన కోసం ఉపాధి, పునరావాస పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె.లక్ష్మీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదేళ్లలో మహిళలు, పిల్లలు , వికలాంగులు, వయోవృద్ధుల శాఖ, ఏదైనా ప్రభుత్వ సంస్థ నుంచి సబ్సిడీ పొంది ఉండరాదు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 14వ తేదీ నుంచి 31వ తేదీ వరకు https://tgobmms.cgg.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ట్రాన్స్ జెండర్లకు ఉపాధి కోర్సులు..

ప్రభుత్వం ట్రాన్స్ జెండర్లకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో డ్రైవింగ్, ఫొటో, వీడియోగ్రఫీ, బ్యూటీషియన్, జ్యూట్‌బ్యాగ్, టైలరింగ్, లాజిస్టిక్ రంగాల్లో శిక్షణ ఇవ్వనుంది. ఆసక్తి కలిగిన వారు www.wdsc.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 040- 24559050 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

గర్భిణిని కాపాడిన వైద్యులు



ప్రవీణతో వైద్యుల బృందం

గజ్వేల్: గజ్వేల్ మాతా శిశు సంరక్షణ ఆస్పత్రికి చెందిన వైద్యులు ఓ తల్లికి కఠినమైన శస్త్ర చికిత్స నిర్వహించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. వివరాలు... గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీలోని వేములగట్ గ్రామానికి చెందిన ఎర్రన్నగారి ప్రవీణ ఇన్ ఫర్టిలిటీ ద్వారా గర్భం దాల్చింది. కానీ ఈ గర్భం అసాధారణ రీతిలో గర్భాశయంలో కాకుండా ఫెలోపియన్ ట్యూబ్‌లో పిండం ఉన్నట్లు గుర్తించారు. అంతే గాకుండా ఆమెకు రక్తం 7హెచ్‌బీ గ్రాములు మాత్రమే ఉందని, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు హైదరాబాద్ వెళ్లాలని సూచించారు. ఇదే క్రమంలో ప్రభుత్వాస్పత్రిని సదరు మహిళ ఆశ్రయించింది. దీంతో ఆమెకు శస్త్ర చికిత్స చేసేందుకు సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ఏర్పాట్లు చేశారు. ఆమె కడుపులోంచి 500 గ్రాముల పిండం రక్తపు గడ్డలను ఫెలోపియన్ ట్యూబ్‌లో నుంచి తొలగించారు. ప్రస్తుతం ఆమె క్షేమంగా ఉంది. డాక్టర్ అన్నపూర్ణతో పాటు ప్రణయరెడ్డి, మత్తుమందు వైద్యులు సూర్య, ఓటీ థియేటర్ అసిస్టెంట్ శ్రీలత తదితరులు శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశారు.

బావిలో పడి కూలీ మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): బావిలో పడి కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని విఠలాపూర్‌లో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మేకల రవి(45) కూలీ పనులు చేస్తూ భార్యాపిల్లలతో జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం కూలీ పనులకు వెళ్లాడు. వ్యవసాయ భావి సమీపంలో చెట్టును కొడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి బావిలో పడ్డాడు. ఇది గమనించిన తోటి కూలీలు గ్రామస్తులకు సమాచారం అందించి వారి సహాయంతో రవిని బయటకు తీశారు. వెంటనే ప్రైవేటు వాహనంలో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైఫ్ అలీ తెలిపారు.

మొక్కజొన్న సాగుకే మొగ్గు

జహీరాబాద్ డివిజన్‌లో గతేడాది కంటే అత్యధికం

- తగినంత వర్షపాతం లేకపోవడంతో రైతుల ఆసక్తి
- గిట్టుబాటు ధర, నమ్మకంగా చేతికొస్తుందనే ఆశ
- కూలీల అవసరం ఉండక పోవడమే కారణం



కోహీర్ మండలంలో సాగు చేసిన మొక్కజొన్న

ఈ ఏడాది జహీరాబాద్ నియోజకవర్గంలో మొక్కజొన్న పంట విస్తారంగా సాగవుతోంది. గతేడాది పత్తి అధికంగా సాగు కావడంతో ఈ సారి పంట మార్పిడి అవుతుందని, నమ్మకమైన పంట కావడంతో మొక్కజొన్నకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. తగిన మేర వర్షాలు కూడా లేకపోవడంతో మినుము, పెసర సాగుకు అదను మించిపోవడంతో ప్రత్యామ్నాయంగా ఈ పంటను సాగు చేస్తున్నారు.

జహీరాబాద్: జహీరాబాద్ డివిజన్‌లో 90 శాతం మేర మొక్కజొన్న పంట సాగవుతోంది. ఇప్పటికే 10వేల ఎకరాల్లో పంట సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది 2వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ సారి మాత్రం 75 శాతం సాగు విస్తీర్ణం పెరిగింది. వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు ఇంకా మొక్కజొన్న పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వర్షపాతం లేకపోవడంతో మినుము, పెసర సాగుకు సమయం మించిపోవడంతో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. జిల్లాలోనే జహీరాబాద్ ప్రాంతంలో మొక్కజొన్న సాగు అధికంగా ఉంది. డివిజన్ పరిధిలోని జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల్లో పంట సాగులోకి వచ్చింది. అత్యధికంగా కోహీర్ మండలంలో రైతులు సాగు చేస్తున్నారు. డివిజన్ పరిధిలో 80 శాతం పంట ఈ మండలంలోనే సాగవుతోంది. మొక్కజొన్నలో అంతర పంటగా కంది వేస్తున్నారు. బావులు, బోర్లు ఉన్న రైతులు మాత్రం ఒక్క మొక్కజొన్న పంటనే వేసుకుంటున్నారు. పంట తీసుకున్న తర్వాత రెండో పంటగా శనగ లేదా తెల్లకుసుమ పంటను సాగు చేయనున్నారు.

తెగుళ్లను తట్టుకొని..

తెగుళ్లు, వాతావరణ పరిస్థితులను తట్టుకుని పంట చేతికి వస్తుండటంతో రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గుతున్నారు. అధిక వర్షాలు కురిస్తే ఇతర పంటలు దెబ్బతింటున్నాయని, ఈ పంటను వేస్తే పంట దిగుబడి ఎకరానికి 25 క్వింటాళ్ల వరకు వస్తుండటంతో సాగు చేస్తున్నారు.

గిట్టుబాటు ధర ఉండడంతో..

మొక్కజొన్న పంటకు కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.2,360 కనీస మద్దతు ధర ప్రకటించింది. దీంతో ఈ పంట వేసే గిట్టుబాటు అవుతుందనే ఆశతో రైతులు ఉన్నారు. బహిరంగ మార్కెట్లో ధర తక్కువగా ఉంటే ప్రభుత్వం కొనుగోలు చేసే అవకాశం ఉండటంతో సాగు పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. అలాగే కలుపు నివారణ, పంట కోతకు కూలీల అవసరం లేకపోవడం కూడా ఓ కారణమని అధికారులు చెబుతున్నారు. కలుపు నివారణ మందులను స్ప్రే చేసుకోవడం, పంట చేతికి వచ్చాక యంత్రాల సహాయంతో రాసులు చేసుకునే వెసులుబాటు ఉండటంతో రైతులు సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం



తగినన్నీ వర్షాలు పడకపోవడంతో రైతులు మొక్కజొన్న సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. దీంతో సాగు విస్తీర్ణం బాగా పెరుగుతోంది. పత్తి, సోయాబీన్, కంది, మినుము పంటల సాగు సమయం మించి పోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా ఇటువైపు మొగ్గు చూపుతున్నారు. మొక్కజొన్న ఎప్పుడైనా సాగు చేసే వీలుండటంతో సాగు పెరిగింది. ఇంకా రైతులు మొక్కజొన్న విత్తనాలు వేసుకుంటున్నారు.

–ప్రదీప్‌కుమార్, ఏఈఓ, జహీరాబాద్

త్వరలో ఉపాధ్యాయులకు పీఆర్సీ

ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి



హెచ్‌ఎం రమాదేవి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, తదితరులు

వర్గల్(గజ్వేల్): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని, త్వరలోనే పీఆర్సీని సాధించబోతున్నామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వర్గల్ మండలం గౌరారంలో ఓ ఫంక్షన్ హాల్‌లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన శేరిపల్లి హెచ్‌ఎం కాయిత రమాదేవి ఉద్యోగ విరమణ సభకు హాజరై సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ సాధించుకున్న ఘనత పీఆర్టీయూ సంఘానికే దక్కుతుందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుండు లక్ష్మణ్, దామోదర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మ, మండల పీఆర్టీయూ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు సునీత, ఉదయ భాస్కర్, జిల్లా నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుభాష్ రెడ్డి, లక్కిరెడ్డి విజయ పాల్గొన్నారు.

నానో యూరియా, డీఏపీతో ప్రయోజనాలు

వ్యవసాయ శాస్త్రవేత్త రవికుమార్



తమ్మాయపల్లిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పాపన్నపేట(మెదక్): నానో యూరియా, డీఏపీ వాడకంతో అధిక ప్రయోజనాలు ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త రవికుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన వ్యవసాయ అధికారులతో కలిసి మండలంలోని తమ్మాయపల్లి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. నానో డీఏపీ వాడకం వల్ల పంటకు అధిక ప్రయోజనాలు చేకూరుతాయని, దీంతో ఎరువులు ఆదా అవుతాయని తెలిపారు. నేల ఆరోగ్యంగా ఉండేలా చూస్తుందన్నారు. పీఎస్‌బీ వాడకం వల్ల నేలలో ఉన్న భాస్వరం త్వరగా కరుగుతుందని చెప్పారు. నానో యూరియా స్ప్రే చేసిన 4 గంటల్లోపు 95 శాతం శోషించుకుంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమాధురి, ఏఈఓ నాగరాజు, రైతులు రాంరెడ్డి, అనీల్ రెడ్డి, సాయిలు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

కొల్చారం(నర్సాపూర్): వరి సాగు చేసి నష్టపోతున్న రైతులు, ఆయిల్ పామ్ సాగు చేసి అధిక లాభాలు పొందాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో జిల్లా ఉద్యాన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ప్రతాప్‌సింగ్, జడ్పీసీఈఓ చేతుల మీదుగా రైతు జగదీష్ పొలంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రైతులకు 90 శాతం సబ్సిడీపై అవసరమైన మొక్కలు, డ్రిప్ ఇస్తుందన్నారు. జిల్లాలో 2025–26 సంవత్సరానికి 2500 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటల సాగు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి తెలిపారు. ఇప్పటివరకు 1545 ఎకరాలకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. అందులో నుంచి 771 ఎకరాలు ఆయిల్ పామ్ తోటలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్వేతా కుమారి, ఏఈఓలు రాజశేఖర్ రెడ్డి, నిరోషా, కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లోని ప్రతి కాలనీ పరిశుభ్రంగా ఉండాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని ధర్మాసాగర్‌లో డ్రైడే కార్యక్రమంతోపాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత డబ్బాలు, కొబ్బరి బోండాలు, టైర్లు, నిరుపయోగంగా ఉండే నీటితొట్లలో నీరు నిలువలేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఏ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి నరహరి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆశవర్కర్ మంజుల పాల్గొన్నారు.

కూలీలు లేకుండా.. చేనుకు ఎరువు



పత్తి చేనుకు వాటర్ డబ్బాల సహాయంతో ఎరువులు వేస్తున్న రైతు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఓ రైతు వినూత్న ప్రయోగంతో కూలీల ఖర్చు లేకుండా చేనుకు ఎరువులు వేశాడు. ప్రస్తుతం పత్తి చేనులో గొర్రు, దంతెలు, కలుపు పనులు సాగుతున్నాయి. అయితే తిగుల్‌కు చెందిన రైతు చేనుకు ఎరువులు వేసేందుకు కూలీలు అవసరం లేకుండానే రెండు వాటర్ డబ్బాలకు రంధ్రం చేసి ఆన్ ఆఫ్ బటన్ పెట్టారు. డబ్బాలను గొర్రుకు కట్టుకుని అందులో ఎరువులు పోసి చేనుకు పడేలా వేస్తున్నాడు. దీంతో ఇద్దరు కూలీల ఖర్చు తగ్గుతుందని రైతు తెలిపారు.

పందిరి సాగు ఎంతో లాభదాయకం

హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ రాజిరెడ్డి



పందిరి సాగును పరిశీలిస్తున్న వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి , అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కొండపాక(గజ్వేల్): పందిరి తోటల కూరగాయల సాగు ఎంతో లాభదాయకమని కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ రాజిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బందారం శివారులో రైతు అమ్మన రాజిరెడ్డి 30 ఎకరాల్లో సాగు చేస్తున్న పందిరి కాకర, బీర కూరగాయల క్షేత్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి సందర్శించారు. పశువుల ఎరువును సేంద్రీయ ఎరువుగా తయారు చేసే యూనిట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పందిరి సాగుకు ప్రభుత్వం రూ. లక్ష వరకు సబ్సిడీ ఇస్తుందని, కానీ ఎకరాకు సుమారు రూ. 4లక్షల వరకు ఖర్చు అవుతుందని వీసీ రాజిరెడ్డి దృష్టికి రైతు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజిరెడ్డి మాట్లాడుతూ.. కూలీల కొరతను అధిగమించి యంత్ర పరికరాలతో పండించిన కూరగాయలను మద్రాస్‌తో పాటు ఖమ్మం వరంగల్,కరీంనగర్, హైదరాబాద్‌లోని మార్కెట్‌ల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతు రాజిరెడ్డి దంపతులను వైస్ చాన్స్‌లర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ జిల్లా అధికారి సువర్ణ, మండల అధికారి కౌసల్య, యూనివర్సిటీ అధికారులు సురేష్‌కుమార్, భగవాన్, చీనా, లక్ష్మీనారాయణ,నాయకులు దుర్గయ్య, కరుణాకర్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

వసురాంతండాలో విషాదం

మెదక్‌జోన్/కొల్చారం: తోడబుట్టిన అన్నను కల్లుసీసాతో పొడిచి అతి కిరాతకంగా తమ్ముడు హత్య చేసిన ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం వసురాంతండాలో కలకలం సృష్టించింది. తండాకు చెందిన రమావత్ మోహన్, రమావత్ మంత్యా(48) అన్నదమ్ముళ్లు. కాగా గత నాలుగైదు రోజుల నుంచి అన్న మంత్రాలు చేసి నా మనవరాలిని చంపాడని మోహన్ ఆరోపిస్తూ నా భర్తను తిట్టాడని మృతుడి భార్య సంతూ తెలిపింది. అదే మనస్సులో పెట్టుకుని దానికి తోడు పొలం దున్నిన ట్రాక్టర్ డబ్బులు ఇవ్వాలంటూ నా భర్తను చంపాడని వాపోయింది. నా భర్త ఆయన తమ్ముడిని ఎంతో అపురూపంగా చూశాడని, అలాంటిది ఆయనే యముడై నా భర్తను చంపాడని బోరున విలపించింది. కాళ్లు నొప్పులుగా ఉన్నాయని ఊరిలో డాక్టర్ వద్ద సూది మందు వేసుకుని కల్లు దుకాణం వద్దకు వెళ్లాడని, అంతలోనే అక్కడే ఉన్న నా భర్తను మోహన్ చంపాడని పేర్కొంది. వృద్ధురాలైన తల్లి ప్రమీల కొడుకు మృతదేహంపై పడి బోరున విలపించింది.

పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- ముఠాలో ఇద్దరు అరెస్ట్
- మిగతా నలుగురి కోసం గాలింపు
- వివరాలు వెల్లడించిన సీఐ లతీఫ్



మాట్లాడుతున్న తొగుట సీఐ లతీఫ్

కొండపాక(గజ్వేల్): ఇండ్లలో దొంగతనాలకు పాల్పడిన దొంగల ముఠాలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో తొగుట సీఐ లతీఫ్ వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఆరుగురు ముఠాగా ఏర్పడి హైదరాబాద్‌లోని వినాయకనగర్‌లో నివాసం ఉంటున్నారు. సిద్దిపేట జిల్లాలోని పలు గ్రామాల్లో పగటి పూట రెక్కీ చేస్తూ.. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తారు. రాత్రి వేళల్లో దొంగతనం చేసి వచ్చిన డబ్బులతో జల్సా చేసేవారు. ఈ క్రమంలో జిల్లాలోని 19 చోట్ల దొంగతనాలు చేయగా 6 పోలీస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం కుకునూరుపల్లిలోని బస్టాండ్ వద్ద ఎస్సై శ్రీనివాస్ పెట్రోలింగ్ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అన్నారెడ్డి రమేష్, కూజ నర్సయ్య అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలతో పాటు కొంత సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఇద్దరిని కోర్టులో హాజరుపర్చారు. మిగతా నలుగురి కోసం గాలిస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

సిద్దిపేటలో ఘటన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఫినాయిల్ తాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేశాడు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా... మహాత్మా జ్యోతిపూలే బీసీ సంక్షేమ గురుకులంలోని 10వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఫినాయిల్ తాగాడు. గమనించిన సిబ్బంది విద్యార్థిని సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని లోహిత్ సాయి ఆస్పత్రికి తరలించగా ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. తమ కుమారుడు ఫినాయిల్ తాగడానికి కారణం మార్కులు తక్కువగా వస్తాయనే భయం కావచ్చని విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. అతడి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా కలెక్టర్ హైమావతి విద్యార్థినిని పరామర్శించారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్వీ నాయకులు గురుకులం ఎదుట నిరసన తెలిపారు. సిద్దిపేట ఆర్డీవో సదానందం వచ్చి విద్యార్థి సంఘం నాయకులకు నచ్చజెప్పారు.

కాలిపోయిన పీర్లు

ఘటనా స్థలాన్ని సందర్శించిన డీఎస్పీ

(సంగారెడ్డి): మండల పరిధిలోని కాశీపూర్‌లో పీర్లు కాలిపోయాయి. ఎస్ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం... మొహర్రం సందర్భంగా కాశీపూర్‌లో ఏర్పాటు చేసిన పీర్ల వద్ద గురువారం రాత్రి గ్రామస్తులందరూ కలిసి ఆటపాట నిర్వహించారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున పీర్లు కాలిపోయి కనిపించాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ సత్తయ్య గౌడ్, రూరల్ సీఐ క్రాంతి కుమార్, ఎస్సై విజయకుమార్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. పీర్ల ముందు ఊదును కాల్చేందుకు ఏర్పాటు చేసిన ఉద్దాన్ నుంచి వచ్చే మిరుగుల వల్ల పీర్లు కాలిపోయి ఉండవచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రెడిట్ కార్డు ఏజెంట్ అని నమ్మించి..

రూ.1.22 లక్షలు మాయం

అక్కన్నపేట(హుస్నాబాద్): బ్యాంక్ క్రెడిట్ కార్డు ఏజెంట్ అంటూ నమ్మబలికి బ్యాంక్ ఖాతాలోంచి డబ్బులు మాయం చేశాడు. ఈ ఘటన మండలంలోని కేశనాయక్‌తండా గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ చాతరాజు ప్రశాంత్ వివరాల ప్రకారం ... తండాకు చెందిన లావుడ్యా రాజుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఏజెంట్ అంటూ ఫోన్ వచ్చింది. అలాగే మీ క్రెడిట్ కార్డును అప్డేట్ చేయాలని, మీ ఫోన్‌కు ఒక ఓటీపీ వచ్చిందని అది చెప్పాలన్నాడు. సదరు బాధితుడు నిజమేనని నమ్మి ఓటీపీ చెప్పడంతో ఖాతాలో ఉన్న రూ.1.22లక్షలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో కంగుతిన్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో బ్యాంకు అటెండర్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రిమ్మనగూడ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడకండ్లలోని ఎస్‌బీఐ బ్యాంకులో అటెండర్‌గా పనిచేస్తున్న సతీష్(43) శుక్రవారం రాత్రి ప్రజ్ఞాపూర్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో రిమ్మనగూడ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీఐ సైదా సంఘటనా స్థలానికి చేరుకొని సతీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల భూమి.. దర్జాగా కబ్జా

రాత్రికి రాత్రే చదును చేసిన వైనం

- ఆక్రమించిన భూమి విలువ రూ.కోటిన్నర
- గతంలోనే 7ఎకరాలు గురుకులానికి కేటాయింపు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



గురుకుల స్థలాన్ని చదును చేసిన అక్రమార్కులు

మండల కేంద్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. విలువలైన భూములపై కబ్జాకోరులు కన్నేసి రాత్రికి రాత్రే చదును చేసి దర్జాగా ఆక్రమించుకుంటున్నారు. ఇంత జరిగినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్):

మండల కేంద్రంలోని ఏనే శివారులో సర్వే నం.387బై1లో 07ఎకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం హయాంలో 'ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల భవనానికి కేటాయించారు. స్థలం, హద్దు, విస్తీర్ణంతోపాటు పంచనామా పత్రాన్ని గురుకులం ప్రిన్సిపాల్‌కు రెవెన్యూ అధికారులు అప్పగించారు. ఈ నేపథ్యంలో రెండ్రోజుల కింద గురుకులానికి కేటాయించిన ఈ స్థలాన్ని కొంతమంది కబ్జా చేసి చదును చేశారు. రాత్రికి రాత్రే హిటాచీలు, జేసీబీతో బండరాళ్లను, చెట్లను తొలగించారు. అయితే, ప్రస్తుతం ఇక్కడ ఎకరం భూమి దాదాపుగా రూ.20లక్షల వరకు పలుకుతోంది. దాదాపు ఐదెకరాల వరకు ప్రభుత్వ భూమిని కబ్జా చేయగా.. దీని విలువ సుమారు రూ.కోటిన్నర వరకు ఉంటుంది. ఈ కబ్జా తతంగం ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో అటుగా వెళ్లిన వాహనదారులు సైతం ఈ భూమిని గిరిజన బాలికల భవన నిర్మాణానికి కేటాయించారని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. కాగా ప్రస్తుతం గిరిజన బాలికల గురుకుల పాఠశాల హుస్నాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాల భవనంలో కొనసాగుతోంది.

కబ్జాల పర్వం

మండల కేంద్రంలో సర్వే నం.387లో దాదాపు 600 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే, విడతల వారీగా సుమారుగా 372 ఎకరాల భూమిని పేదలకు పంచారు. మిగిలిన 228 ఎకరాల భూమి కేవలం రికార్డుల్లో మాత్రమే ఉంది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ప్రభుత్వ భూమి కబ్జా కోరల్లో ఉంది. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో గిరిజన బాలికలకు కేటాయించిన స్థలం కబ్జాపై గిరిజన సంఘాలు ఆందోళనలు చేసేందుకు సిద్ధమవుతున్నాయి.

విచారణ చేస్తాం



ఎస్టీ బాలికలకు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేస్తే ఊరుకోం. వెంటనే విచారణ చేపట్టి చదును చేసిన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం. ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జా చేస్తే కేసులు నమోదు చేస్తాం.

– అనంతరెడ్డి, తహసీల్దార్, అక్కన్నపేట మండలం